క్లుప్తంగా

చర్చిలో మురుగుడు లావణ్య ప్రత్యేక ప్రార్థనలు



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని హోసన్నా చర్చిలో బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చినకాకానిలో పలు కార్యక్రమాలకు హాజరైన లావణ్య చర్చిలో పాస్టర్ ప్రదీప్ నిర్వహించిన ప్రార్థన కూడికలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ శ్రమల దినాల్లో శుభ శుక్రవారానికి ముందు క్రీస్తు ప్రేమను గురించి ఆయన రాకడ ఉద్దేశాన్ని గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన గోపికృష్ణ(27) చేపలు విక్రయిస్తుంటాడు. మొదటి భార్యతో విడిపోయిన అతను పొన్నూరుకు చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవలి కాలంలో వీరి కుటుంబంలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం చినరావూరు స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబర్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు మంచాల రమేష్, సామరౌతు సతీష్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను జనసేన నేత నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు గ్యాలం వేణు, తోట పానకాలరావు, గాంధీ, పోకల రమేష్, వెల్పూల గంగాధరరావు, మంచాల సురేష్, నాగం సురేష్, పాల్గొన్నారు.

అర్చకులపై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: కాకినాడలో అర్చకులపై దాడిచేసిన ఘటన సిగ్గుచేటని బ్రాహ్మణ సామాజిక వర్గం నేతలు బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణ, మల్లేపల్లి హనుమంత శర్మ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని వారి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లో మీడియా అర్చకులపై జరిగిన దాడిని కూడా రాజకీయ రంగు పులమడం దుర్మార్గమన్నారు. అర్చకులపై దాడి చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడాలని డిమాండ్ చేశారు. ఒక ప్రముఖ దినపత్రిక అధినేత కావాలనే ఉద్దేశపూర్వకంగా కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. టీడీపీని అధికారంలోని తెచ్చేందుకు ఆయన తపన పడుతున్నారని, కృష్ణా పుష్కరాల సందర్భంగా ఆధునికీకరణ పేరుతో టీడీపీ నేతలు అనేక దేవాలయాలను కూల్చి వేశారని ఆరోపించారు. ఎవరెన్ని కుటలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే బ్రాహ్మణ సామాజిక వర్గం నడుస్తుందని పేర్కొన్నారు.

4 రోజుల్లో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిదారులకు ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 4 రోజులు మాత్రమే ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ నెలాఖరులోగా తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని సూచించారు. ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందన్నారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేట , పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని కమిషనర్ వివరించారు.

రాజకీయ లబ్ధికోసం పేదల జీవితాలతో ఆటలు

- మాదిగలు, మాలల మధ్య చిచ్చుపెట్టేందుకు చంద్రబాబు కుట్ర
- ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు దళితులెవ్వరూ మర్చిపోరు
- ఇప్పుడు వారిపై కపట ప్రేమ నటిస్తున్నాడు
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే మాదిగలు, మాలల జీవితాల్లో మార్పులు
- వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ముదిగొండ ప్రకాష్, తదితరులు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో అన్నదమ్ముల్లా ఉన్న మాదిగ, మాలల మధ్య చిచ్చుపెట్టేది చంద్రబాబేనని, ఆయన రాజకీయ లబ్ధికోసం అన్నదమ్ముల్లా ఉన్నవారిని విడగొట్టి లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారని ప్రజలకు చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు ఇప్పటికే అర్థమయ్యాయని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ అన్నారు. బుధవారం పార్టీ తాడేపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మాదిగ, మాలల జీవన విధానంలో ఎంతో మార్పు వచ్చిందని, గౌరవంగా సమాజంలో తలెత్తుకు తిరుగుతున్నామన్నారు. ఆయన ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. చంద్రబాబు 2014లో అధికారం వచ్చిన తరువాత పోలీసులతో లాఠీచార్జి చేయించి ఎంతో మంది మాదిగలను జైలుపాలు చేశారని, ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తూ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేయిస్తాని అంటున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని దళిత వర్గాలవారిని కించపరుస్తూ మాట్లాడిన సంగతి ఎవరూ మర్చిపోరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నందిగం సురేష్‌కు బాపట్ల ఎంపీ టిక్కెట్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ నుంచి మాదిగలను పార్లమెంట్‌కు పంపించారన్నారు. మందకృష్ణ మాదిగ చంద్రబాబునాయుడుకు తొత్తుగా ఉండి మాదిగ జాతిని తాకట్టు పెట్టడం సరైనది కాదని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాల, మాదిగ, మహిళలకు హోమ్ శాఖ మంత్రి పదవిని ఇవ్వడం, విద్యాశాఖ మంత్రిగా మాదిగ వర్గానికి చెందిన ఆదిమూలపు సురేష్‌కు ఇచ్చారన్నారు. ప్యాకేజీ కావాలంటే మాల, మాదిగ సోదరులందరూ చందాలు వేసుకుని ఇస్తామని, అంతేకాని కులం కార్డు అడ్డంపెట్టుకుని సంపాదించుకోవద్దని హితవు పలికారు. తాడేపల్లి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలసాని అనిల్, గుంటూరు జిల్లా సేవాదళ్, విద్యార్థి విభాగం సెక్రటరీలు చిలుకోటి శ్రీనివాస మధు, తొట్టెంపూడి వికాస్, సచివాలయం కన్వీనర్ సింహాద్రి గోపి, బోయినపల్లి రాజు, పల్లెపోగు నాగభూషణం, చిత్తూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.11.51లక్షలు



దాత రావి గీతిక దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ చినవెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో భక్తులచే సమర్పించబడిన హుండీ కానుకలను దేవస్థానంలోని 9 హుండీలను కాజ గ్రూపు దేవాలయాలు, దేవదాయ శాఖ గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి పి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తెరిచి కానుకలు లెక్కించగా రూ. 11,54,564/- ఆదాయం లభించిందని తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు బుధవారం రూ.1,00,116లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ తెనాలి వాస్తవ్యులు రావి అంకినీడు ప్రసాద్ దంపతుల కుమార్తె రావి గీతిక దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారని తెలిపారు. అనంతరం రావి గీతిక దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నేడు పెదకొండూరు నుంచి లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య గురువారం దుగ్గిరాల మండలం పెదకొండూరు నుంచి ప్రచారం నిర్వహించనున్నట్లు ఆమె కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం సాయంత్రం 4 గంటలకు పెదకొండూరులో వేంచేసి వున్న కనకపుట్లమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు బుధవారం తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తున్నట్లయితే ఆ నగదును సీజ్ చేస్తామన్నారు. ఒకవేళ అత్యవసరం ఉన్నచో వాటికి సంబంధించి ఆధారాలు ఖచ్చితంగా వెంట తీసుకురావాలని చెప్పారు.

దుగ్గిరాలలో నీటి ఎద్దడి నివారించండి

రైతు సంఘం సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి, సాగునీటి ఎద్దడి స్పష్టంగా కనిపిస్తోందని రైతు సంఘం సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు అన్నారు. బుధవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన రైతు సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్నకు భూగర్భ జలాలు ఇంకిపోయి పంట పొలాలకు నీరు అందక జొన్న, మొక్కజొన్న దిగుబడి తక్కువ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు యాజమాన్యం ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జెట్టి బాలరాజు, రైతు సంఘం నాయకులు వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి, యోగేశ్వరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో జీజీహెచ్ ప్రసూతి విభాగం



డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ అరుణలకు పత్రాలు అందజేస్తున్న భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ప్రసూతి విభాగంలో భారత పరిశ్రమల సమాఖ్య సహకారంతో రూ.70 లక్షలతో ఆధునికీకరించిన 40 పడకల వార్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రసూతి విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా సిద్ధం చేశారని చెప్పారు. వార్డుకు మూడు టీవీలను సమకూర్చారు. ఏసీలను పూర్తి స్థాయిలో అమర్చారు. వేసవి కాలంలో తల్లి బిడ్డ హాయిగా ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం సహకారంతో రూపొందించినట్లు వెల్లడించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.20.22 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవస్థానం పాలక మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, పాలక మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారిగా శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం సహాయ కమిషనర్ జి.అమర్‌నాథ్ వ్యవహరించారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, సేవా సంస్థల ప్రతినిధులు వంద మంది వరకు స్వచ్ఛందంగా లెక్కింపులో పాల్గొన్నారు. గడచిన 52 రోజులకు గాను రూ.20,22,304లు హుండీ ఆదాయం లభించింది. కొన్ని గ్రాముల బంగారం, వెండి సైతం భక్తులు సమర్పించారు. పాలక మండలి సభ్యులు కనికచర్ల చరణ రత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత, బొద్దులూరు సరస్వతి నాగేశ్వరరావు, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, అళహరి రవికుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెంచుపేట సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్‌గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల నటులకు పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ రంగస్థల నటులకు సత్కార సభ నిర్వహించారు. సభకు కళ పత్రిక డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించారు. అతిథులుగా కళాపోషకులు గంటా పున్నారావు, ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, నాట్యాచార్య కథక్ అంజిబాబు, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, రంగస్థల నటుడు నడింపల్లి వెంకటేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు ఆకురాత్రి భాస్కరచంద్రకు గురజాడ పురస్కారంతో, కత్తి శ్యాంప్రసాద్‌కు బళ్లారి రాఘవ పురస్కారం, డాక్టర్ రాయల్ హరిశ్చంద్రకు సి.యస్.ఆర్. పురస్కారం, షేక్ హుస్సేన్‌కు గరికపాటి రాజారావు పురస్కారం, డాక్టర్ సురభి నిరుపమకు పనారస గోవిందరావు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అనంతరం విజయవాడ హర్షక్రియేషన్స్ నిర్వహణలో పి.బ్రహ్మానందరావు రచన, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన ట్రీట్‌మెంట్ హాస్యనాటిక ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్ జానీబాషా, డి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో మెగా జాబ్ మేళా

నగరంపాలెం: విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కలిపించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహించామని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకుని జీవితంలో స్థిరపడాలని టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కె.వి.బ్రహ్మం అన్నారు. టీజేపీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ – ప్లేస్ మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ భాగస్వామ్యంతో బుధవారం మెగా జాబ్‌మేళా చేపట్టారు. ప్రిన్సిపాల్ ఏ.బి.పి. మనోహర్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే భాషా నైపుణ్యాలతో పాటు కంప్యూటర్‌పై అవగాహన ఉండాలని అన్నారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మ్యాజిక్ బస్ డైరెక్టర్ చిలకా మోహన్ మాట్లాడుతూ డిగ్రీ చదివేటప్పుడు విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు. ఏసెన్సర్, ముత్తుట్ ఫైనాన్స్, జె.వై సాఫ్ట్‌వేర్, బీఎంఎస్, యునోస్ సర్వీస్, క్యూస్, టెక్రో, వేరెమెరిన్, 24/7 ఏఐ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా, వంద మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైన వారికి నియమాక పత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ అధికారి జి.సురేష్‌బాబు, డాక్టర్ ఎస్.అనితాదేవి, భానుమురళీ, డాక్టర్ జేవీసుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, వరలక్ష్మి, సిహెచ్.మణి, అమూల్య, స్వామి పాల్గొన్నారు.

తాడికొండలో ఇంటింటికీ ప్రచారం



జయభారత్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న, మేకతోటి హర్షిత్

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తమ తల్లి సుచరితను ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ కోరారు. బుధవారం తాడికొండ జయభారత్ కాలనీలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన అందరినీ కలిసి ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. తొలుత కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి గ్రామస్తుల నుంచి మంచి ఆదరణ లభించింది. భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారంలో పాల్గొనడంతో ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీ ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ జుబేర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి, బెజ్జం సాయి ప్రసాద్, ఉండవల్లి నరసింహారావు, గుడిపూడి ఆదాం పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో పిల్లల మానసిక థెరపీ కేంద్రం



పిల్లలకు థెరపీ నిర్వస్తున్న క్లినికల్ డైరెక్టర్ సత్నం అగస్య

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం కేఎల్‌యూ చైల్డ్ ఆటిజం కేర్ సెంటర్ ఆధ్వర్యంలో పిల్లల మానసిక థెరపీ కేంద్రాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేఎల్‌యూ ఉపాధ్యక్షులు కోనేరు రాజా హరీన్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అమెరికాకు చెందిన ఎర్లీ ఆటిజం సర్వీస్ (ఇఏఎస్) అనే సంస్థ సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఏడాదిన్నర వయస్సు ఉన్న పిల్లల నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు తమ యూనివర్సిటీలో సంరక్షణ, థెరపీ ద్వారా పిల్లలు తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా తమ పనులను తాము స్వేచ్ఛగా చేసుకునే విధంగా ప్రత్యేక థెరపిస్టులతో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఎర్లీ ఆటిజం సర్వీస్ క్లినికల్ డైరెక్టర్ సత్నం అగస్యా మాట్లాడుతూ కరోనా రెండవ దశ తరువాత జన్మిస్తున్న పిల్లల్లో మానసిక ఆరోగ్యం సరిగా లేని వారు ఎక్కువ శాతం ఉన్నట్లు గుర్తించామని, పిల్లల వయసును బట్టి వారికి దశల వారీగా థెరపీ నిర్వహిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ ఇండియన్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్‌లో ప్రచురించబడిన 2021లో జరిపిన అధ్యయనం ప్రకారం భారతదేశంలో ఆటిజం ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరికి ఉన్నట్లు అంచనా ఉందన్నారు. యుఎస్ఏలో అభివృద్ధి చేయబడిన టెక్నాలజీతో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. చికిత్స, ఇతర వివరాలకోసం ఆటిజం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సత్నాంను 9606752551 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు

నియోజకవర్గ ఈఆర్ఓ, జేసీ రాజకుమారి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఈఆర్ఓ, జేసీ రాజకుమారి తదితరులు

మంగళగిరి: పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాట్లు పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం సెక్టార్ 15,16 లలోని 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు పనిచేస్తున్నాయా, లేదా అని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కోసం కావల్సిన ఫర్నిచర్, ఓటర్లకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, గ్రౌండ్ లెవలింగ్, క్యూలైన్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏఈఆర్ఓ ఎస్.ప్రకాశరావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్



క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో ప్రియదర్శిని కళాశాల చైర్మన్, సెక్రటరీ తదితరులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతపూడి గ్రామంలో ఉన్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రేడియంట్, స్పైక్వాడ్, కియా, ప్రీమియర్ ఎనర్జీ తదితర కంపెనీల వారు తమ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ నిర్వహించారని, ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని టెక్నాలజీ అఫ్ మేనేజ్‌మెంట్, రేపల్లె పాలిటెక్నిక్, దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని మొత్తం 6 కంపెనీల్లో 145 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.రామారావు, విష్ణు ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్ర, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బాల శంకర్, దివిసీమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.రేష్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, శ్రీనివాసరావు, డి.మస్తాన్, అల్లామ్, అనూష, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యాన్ని గుర్తెరగండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని దానిని గుర్తెరిగి అంతా తమ ఓటు హక్కును వచ్చే ఎన్నికల్లో వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. అంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరితో చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామచంద్రరావు, ప్రసాద్, శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం అరుణ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించండి

తెనాలిఅర్బన్: ఎన్నికల కమిషన్ రూపొందించిన యాప్‌లపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బూత్ లెవల్ అవేర్నెస్ గ్రూప్ సభ్యులతో బుధవారం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో 151 గ్రూప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో బూత్ పరిధిలో ఒక్కో గ్రూపు సభ్యులను నియమించడం జరిగిందన్నారు. వారందరూ బూత్‌ల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటు ఆవశ్యకతను అందరికీ తెలియజేయాలని సూచించారు. అలాగే ఎన్నికల కమిషన్ రూపొందించిన యాప్‌లను ఉపయోగించే విధంగా చూడాలన్నారు. ఓటు ఉందా లేదా, నియోజకవర్గ పరిధిలో ఏ రాజకీయ పార్టీ తరఫున ఎవరు పోటీ చేస్తున్నారు..పోలింగ్ బూత్ వివరాలు వంటివి యాప్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే వీడియోలు తీసి ఉన్నతాధికారులకు అందజేయాలని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష పాల్గొన్నారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు లారీలు పత్రాలు లేకుండా 60 టన్నుల ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి వాటిని సీజ్ చేశారు.